త్వరలో పామాయిల్ స్టాక్ యార్డు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు

దశ, పినపాక: పామాయిల్ రైతులకు శుభవార్త అందిందని పినపాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పినపాక మండలం ఈ బయ్యారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో ప్రభుత్వంతో చర్చించి పామాయిల్ స్టాక్ యార్డు ఏర్పాటు కోసం ఒక ఎకరం భూమిని కేటాయింపునకు చర్యలు తీసుకున్నారని చెప్పారు.త్వరలోనే పామాయిల్ స్టాక్ యార్డును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీంతో పామాయిల్ రైతులు తమ పంటను విక్రయించేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గుతాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించినట్లు తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు,సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే పాయం

దశ బూర్గంపాడు: పాల్వంచ మండలం జగన్నాధపురం పంచాయతీలోని పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణం సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో మొరంపెల్లి బంజరు మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి - శివకుమారి దంపతుల కుమార్తె జ్యోతి రెడ్డి, శశిధర్ రెడ్డిల నిశ్చితార్థ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నిశ్చితార్థం అనేది రెండు కుటుంబాలను ఆప్యాయతతో కలిపే శుభసందర్భమని పేర్కొన్నారు. జ్యోతి రెడ్డి, శశిధర్ రెడ్డిలు జీవితాంతం ఆనందంగా, అన్యోన్యంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లక్ష్మీనారాయణ రెడ్డి - శివకుమారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆహ్వానితులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంజీ యూనివర్సిటీలో విద్యార్థినుల ఆందోళన



దశ, నల్గొండ: నల్గొండ పట్టణంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థినిలు ఆర్ధరాత్రి అందోళనకు దిగారు. హాస్టల్ బాత్ రూముల్లో నీటి కొరత ఉందంటూ వీసీ నివాసం ముట్టడించారు.రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. వీసీ బయటకు వచ్చే వరకు కదిలేది లేదన్నారు. రెండు గంటలుగా వీసీ నివాసం ఎదుటే విద్యార్థినుల బైఠాయించారు. విద్యార్థినుల నిరసనకు ఏబీవీపీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. క్యాంపస్ లోకి అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులను పిలిపించడం ఏంటని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యార్థినిలు యూనివర్సిటీ అధికారులు, పోలీసులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు.

ఓయూలో ముగిసిన ఓజస్2K26

❖ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు హాజరైన -ప్రముఖ కవి, గాయకులు జయరాజు

దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో లిటరరీ, అకాడమిక్, కల్చరల్ పోటీలకు సంబంధించిన " ఓజస్2K26 " బుధవారం రాత్రి ఘనంగా ముగిసింది. నగర వ్యాప్తంగా 30 కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులు హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం రాత్రి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో రెండో రోజు జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, గాయకులు జయరాజు హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఓయూ విద్యార్థుల ఉద్యమ స్ఫూర్తిని కొనియాడుతూ కల్చరల్,లిటరరీ, అకాడమిక్ ఫెస్ట్ నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు అలాగే అతిథిగా వ్యాపారవేత్త కే.అంజిరెడ్డి హాజరయ్యారు. సభకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి . కాశీం అధ్యక్షత వహించారు. రెండు రోజులపాటు "ఓజస్2K26" వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులకు అతిథులు, ప్రిన్సిపాల్ కలిసి బహుమతులను అందజేశారు.

ఘనంగా దివంగత వైఎస్ఆర్ జయంతి వేడుకలు

దశ ఓయూ: మాణిక్యేశ్వరి నగర్ కమాన్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం తార్నాక వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆదం సంతోష్ నాయకులు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి విశేష సేవలందించిన మహానేత అని కొనియాడారు.ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అలకుంట గణేష్ ,గండికోట కుమార్,ఎ.లింగయ్య,జి.వెంకటేష్, వెంకటేష్,నర్సింహ, అనిల్ కుమార్ బి. వెంకటేష్,అశోక్,వర్ధరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా యత్నాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై తప్పుడు ప్రచారం..

❖ రిపోర్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు.

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 244లో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు చేసిన యత్నాన్ని అడ్డుకున్న నేపథ్యంలో తమపై కక్షసాధింపుగా తప్పుడు వార్తలు ప్రచురించారని ఆరోపిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), మండల గిర్దవార్ వై. ప్రేమ్‌కుమార్ పోలీసులను ఆశ్రయించారు.

ఆర్ఐ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు సహకరించాలని స్థానికంగా ఓ పత్రికలో పనిచేస్తున్న రిపోర్టర్ తనను సంప్రదించి, ఇందుకోసం భారీ మొత్తంలో డబ్బులు ఇస్తానని ప్రలోభపెట్టడంతో పాటు సహకరించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ తన బాధ్యత కావడంతో ఆ ప్రతిపాదనను తిరస్కరించానని తెలిపారు. అనంతరం జూలై 7న తనపై లంచం డిమాండ్ చేశారంటూ పూర్తిగా అవాస్తవ ఆరోపణలతో వార్త ప్రచురించారని ఫిర్యాదులో ఆరోపించారు.

అలాగే, వార్తలో బాధితుడిగా పేర్కొన్న విష్ణువర్ధన్ రెడ్డి తనతో మాట్లాడిన సందర్భంగా రెవెన్యూ అధికారులు ఎవరూ తనను లంచం అడగలేదని చెప్పారని, దీనికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ కూడా తన వద్ద ఉందని ఆర్ఐ తెలిపారు. తప్పుడు వార్తల ద్వారా తన పరువుకు భంగం కలిగించడంతో పాటు ప్రభుత్వ విధి నిర్వహణకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ సంబంధిత రిపోర్టర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఇదిలా ఉండగా, మండల గిర్దవార్ వై. ప్రేమ్‌కుమార్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 244లో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు జరిగిన ప్రయత్నాన్ని తహసీల్దార్ ఆదేశాల మేరకు అడ్డుకుని అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. అయితే వాస్తవాలను పక్కనపెట్టి తన వివరణ కూడా తీసుకోకుండా కొంతమంది రిపోర్టర్లు తప్పుడు, నిరాధార కథనాలు ప్రచురించి తన ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపించారు.

ఈ తప్పుడు ప్రచారం, బ్లాక్‌మెయిలింగ్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్న ప్రేమ్‌కుమార్, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం అధికారులు చేపట్టిన చర్యల వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, నిజానిజాలను వెలుగులోకి తీసుకువచ్చి న్యాయం చేయాలని పాత్రికేయులకు విజ్ఞప్తి చేశారు.

మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ అఫ్రీన్ బేగం

దశ, రామన్ పాడు : వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని రామన్‌పాడు గ్రామంలో మహిళా సమాఖ్య సమావేశం గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సీసీ మేడం, బుక్ కీపర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ అఫ్రీన్ బేగం అంజాద్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తూ వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు సబ్సిడీపై పలు ఉపాధి అవకాశాలు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో పాటు మహిళా సంఘాలకు అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.ఎం. ఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధా, వార్డు సభ్యుడు పురుషోత్తం, మహిళా సంఘాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మునగనూరు భూములపై భారీ అక్రమాల ఆరోపణలు

❖ ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరపాలి: డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని ముంగనూరు గ్రామ ప్రభుత్వ భూములపై భారీ భూ కుంభకోణం, అక్రమ ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు జరిగాయని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ (ప్రస్తుతం తొర్రూరు డివిజన్) పరిధిలోని ముంగనూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు భూ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదైన సర్వే నంబర్లు 38/1, 44/4, 44/5, 46, 85, 89, 91, 127లను సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చినప్పటికీ, వాటికి అనుబంధంగా ఉన్న కొన్ని సర్వే నంబర్లపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని పత్రికా కథనాలు సూచిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములుగా గుర్తించిన ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భూ మాఫియాకు కొందరు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహకారం లభించిందని ఆరోపించిన ఆయన, సంబంధిత MRO, RDO, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో తుర్కయంజాల్, తొర్రూరు డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నర్సింహా రెడ్డి, కందాల బలదేవ్ రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బాసరాజు సురేష్, నోముల కార్తీక్ గౌడ్, నందగిరి సురేష్, గుండా కృష్ణ, నాగరాజు, గ్రామ పెద్దలు, యువకులు, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీధి కుక్క మృతిపై కాచిగూడ పోలీస్ స్టేషన్ లో స్థానికుల పిర్యాదు

దశ, హైదరాబాద్: బర్కత్ పుర హౌసింగ్ బోర్డు కాలనీలో లక్ష్మీ రెసిడెన్సి వద్ద ఉంటున్న వీధి కుక్క మృతి పై స్థానికులు కాచిగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గత 4 సంవత్సరాల క్రితం వీధుల్లో తిరుగుతున్న ఓ కుక్కను స్థానిక యువత చేరదీసి ఆ కుక్కకు గూటి అని నామకరణం చేసి అప్పటి నుంచి దాని బాగోగులు చూసుకుంటున్నారు. గూటి (కుక్క) కాలనీ రక్షకుడిగా ఉండేదని, ఇటీవల రోడ్లపై తిరుగుతున్న కుక్కల గుంపులో గూటి కూడ ఉంది. అందులో ఓ కుక్క బైక్ పై తల్లితో కలిసి వెళ్ళుతున్న బాలున్ని ఓ కుక్క కరవడంతో అతనికి గాయమైంది. దీంతో ఆమె వీధి కుక్కలపై జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారులకు ఫిర్యాదు చేసింది. జూన్ 29వ తేదీన జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చి అక్కడ ఉన్న కుక్కలతో పాటు గూటిని కూడా తీసుకువెళ్ళి ముసాపేటలో ఉన్న కుక్కల షెడ్ కు తరలించారు. వారం రోజులుగా మూసాపేట్ షెడ్ నుంచి గూటిని తీసుకురావడానికి స్థానికులు ఎంత ప్రయత్నించినా అక్కడి వెటర్నరీ అధికారులు వదిలిపెట్టలేదు. గూటి తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో మంగళవారం స్థానికులకు అప్పగించారు. వెంటనే గూటిని స్థానికులు కె.సాయికుమార్, ఆశ్విన్, వరీష, ఎన్. శరత్ శ్యామ్ లు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. గూటి మృతితో కాలనీలో విశాధ చాయలు అలుముకున్నాయి. గూటి మృతికి జీహెచ్ఎంసీ వెటర్నరీ వైద్యసిబ్బంది, అధికారులే కారణమంటూ కాచిగూడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు స్థానికులు ఎన్. శరత్ శ్యామ్, అశ్విన్, వరీష తదితరులు తెలిపారు.సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి కుక్క మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్క మృతికి కారకులైన వారిపై చట్ట పరంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శ్మశానవాటిక సమీపంలో యువకుడి అనుమానాస్పద మృతి

దశ , హయత్‌నగర్ : పెద్దఅంబర్‌పేట్ - పసుమాముల రహదారి పక్కన ఉన్న శ్మశానవాటిక సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం (జూలై 8) ఉదయం సుమారు 8 గంటల సమయంలో శ్మశానవాటిక సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక పరిశీలన చేపట్టారు. అనంతరం క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించింది.సంఘటనా స్థలాన్ని ఏసీపీ కాశిరెడ్డి, ఎస్‌హెచ్‌వో శంకరయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ పరిశీలించారు. సంఘటనా స్థలంలో సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి ముఖంతో పాటు శరీరంలోని ఇతర భాగాలపై గాయాల ఆనవాళ్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

నార్కట్‌పల్లిలో అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేయాలని జేఏసీ ఆందోళన

❖ రిలే నిరాహార దీక్షకు వ్యాపారులు, ప్రజా సంఘాలు సహకరించాలని పిలుపు

దశ, నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు. రోడ్డు విస్తరణ పనుల పూర్తి కోసం చేపట్టనున్న రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పట్టణంలోని వ్యాపారులు, ఆటో యూనియన్ల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ఇవ్వాలని జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిరుమర్తి యాదయ్య, చింతపల్లి భయాన్న, వడ్డేపల్లి నాగరాజు, చెరకు పెద్దలు, లింగాల యాదయ్య, శివకృష్ణ, దుబ్బాక శ్రీధర్, కొప్పు శ్రావణ్, అల్లె పరమేష్, దోసపాటి విష్ణుమూర్తి, బొబ్బలి దేవేందర్, దండు రవి, పసునూరి శ్రీనివాస్, పుల్లెంల వెంకట్, చెన్నారపు సత్తయ్య, మట్టపల్లి రాజు, బొబ్బలి మధు, షేక్ జానీ, గోసుల హరీష్, వెంకన్న, బొబ్బలి మహేష్, మంద సుధాకర్, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

❖ *అదనపు కలెక్టర్ వేణుగోపాల్*

దశ బూర్గంపాడు: మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి కేంద్రంలో కచ్చితంగా అమలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం బూర్గంపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ కేంద్రాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు తహసీల్దార్ ప్రసాద్ , మండలంలోని గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓలు), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), మీసేవ కేంద్రాల వీఎల్ఈలు, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు , జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అనంతరం భద్రాచలం మండలంలో కూడా ఇదే అంశాలపై తహసీల్దార్, జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ కేంద్రాల వీఎల్ఈలు, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్, జిల్లా మేనేజర్ కృష్ణమూర్తితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మీసేవ కేంద్రాలు నిర్ణయించిన పని వేళలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

దరఖాస్తుదారుల నుంచి అవసరం లేని భౌతిక పత్రాలను మండల రెవెన్యూ కార్యాలయాలు కోరకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ రసీదుల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కాగితపు రసీదులకు బదులుగా దరఖాస్తుదారుల మొబైల్‌కు రసీదు సందేశం పంపించి, అవసరమైతే ఈప్రింట్ సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుములకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు వసూలు చేయరాదని హెచ్చరించారు.

దరఖాస్తులకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను మాత్రమే అప్లోడ్ చేయాలని, ప్రతి పత్రాన్ని స్పష్టంగా స్కాన్ చేసి నాణ్యతతో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి మీసేవ కేంద్రంలో రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తారని, వారితో మర్యాదపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకత, బాధ్యతతో సేవలు అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సమావేశాల్లో తహసీల్దార్లు, కేర్ కే వి ప్రసాద్ , రవి పంచాయతీ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మీసేవ కేంద్రాల వీఎల్ఈలు, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు , జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జూలై 10 రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి: వామపక్ష విద్యార్థి సంఘాలు

దశ, మణుగూరు: జూలై 10న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు బంద్ నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసు అఖిల్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీ, ప్రభుత్వ విద్యకు తగిన బడ్జెట్ కేటాయింపు, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్యమైన వసతి, భోజనం, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణ, విద్యార్థి సంఘాల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, విద్యార్థి సంఘ ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల అభివృద్ధి, గ్రామీణ-గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి తేవడం వంటి డిమాండ్లతో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా విద్యార్థి సంఘాల ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం సమస్యలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు బంద్‌కు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేజ హర్ష, రోహిత్, ప్రేమచరణ్, సూర్యతేజ, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా కేసుపాక రాజేష్ నియామకం

దశ, బూర్గంపాడు: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బూర్గంపాడు మండల అధ్యక్షుడుగా బూర్గంపాడుకు చెందిన కేసుపా క రాజేష్ ను నియమిస్తూ బుధవారం జిల్లా ఎ స్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుగా ఎన్నికైన కేసుపాక రాజేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడుగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియమానికి సహకరించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, డిసిసి అధ్యక్షురాలు దేవి ప్ర సన్నకు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కావంపల్లి సత్యనారాయణ కు, భద్రాద్రి కొత్త గూ డెం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ కు, కాంగ్రెస్ పార్టీ మండల జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ, ఎస్సీ సెల్ పురోభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా నియామకంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

దశ,మణుగూరు(టౌన్): తెలంగాణ రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సింగరేణి మణుగూరు ఏరియా విశ్రాంత ఉద్యోగులు, ఐఎన్‌టీయూసీ సీనియర్ కార్మిక నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు గణేష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాయం వెంకటేశ్వర్లుకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడంతో పాటు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే నియోజకవర్గంలో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

❖ *జూలై 15 వరకు అవకాశం.. -నిరుద్యోగ యువత వినియోగించుకోవాలన్న ఎంపీడీఓ సంకీర్త్*

దశ, పినపాక: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సంకీర్త్ తెలిపారు. బుధవారం అయన ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడారు. ఈ శిక్షణల్లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీ థెరపిస్ట్, వేర్‌హౌస్ సూపర్‌వైజర్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్ (ఎలక్ట్రికల్), జనరల్ డ్యూటీ అసిస్టెంట్, సోలార్ పంప్ టెక్నీషియన్, మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అర్హులైన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కేంద్రాలు భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేటలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 15, 2026లోగా పినపాక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79931 02529 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

కూనవరం బండెల దొడ్డి నిర్మాణానికి సింగరేణి ముందుకు రావడం హర్షణీయం

❖ *టీజీబీకేఎస్ నాయకుడు నాగెల్లి వెంకటేశ్వర్లు*

దశ,మణుగూరు : కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో బండెల దొడ్డి నిర్మాణానికి మణుగూరు సింగరేణి యాజమాన్యం చర్యలు ప్రారంభించడం స్వాగతించదగ్గ పరిణామమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పాత కూనవరం ప్రాంతంలోని కూల్చివేసిన సింగరేణి క్వార్టర్ల సమీపంలో బండెల దొడ్డి నిర్మాణం కోసం అధికారులు స్థల పరిశీలన చేపట్టడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు గ్రామంలో పశువుల సంరక్షణ, కార్మిక కాలనీల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యతలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో బండెల దొడ్డి లేకపోవడంతో పశువులు రహదారులపై, సింగరేణి కార్మిక కాలనీల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. పశువుల దాడులతో పలువురు గాయపడటమే కాకుండా, ఒక కార్మికుడి తల్లి మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుందని గుర్తుచేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం టీజీబీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యం, కూనవరం గ్రామపంచాయతీ పాలకవర్గం, పోలీసు శాఖ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఇప్పుడు సింగరేణి యాజమాన్యం బండెల దొడ్డి నిర్మాణానికి ముందుకు రావడం కార్మికులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్న నిర్ణయమని అన్నారు. బండెల దొడ్డి నిర్మాణం పూర్తయితే రహదారులపై పశువుల సంచారం తగ్గి రోడ్డు ప్రమాదాలు తగ్గడంతో పాటు కార్మిక కాలనీల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మణుగూరు సింగరేణి యాజమాన్యాన్ని, సంబంధిత అధికారులను నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ వైద్యం పారదర్శకంగా అందాలి

ప్రాథమిక వైద్య సేవలు పై సంతోషం వ్యక్తం చేసిన డాక్టర్ వరుణ్.

దశ బూర్గంపాడు: ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ వైద్యం పారదర్శకంగా అందాలని డాక్టర్ వరుణ్ అన్నారు. బుధవారం డిప్యూటీ రీజినల్ డైరెక్టర్ (జాతీయ ఆరోగ్య మిషన్) కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ వరుణ్ మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏ ఏ ఎం /సబ్ సెంటర్స్ లక్ష్మీపురం, టేకులచెరువులను సందర్శించడం జరిగింది. ఈ సందర్శన లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, గ్రామ స్థాయిలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు,, రక్త పోటు, మధుమేహం, వచ్చిన వారికీ చికిత్స మలేరియా, డెంగీ వచ్చిన వారికీ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. మలేరియా, డెంగీ రాకుండా ముందు జాగ్రత్త గా తీసుకుంటున్న చర్యలు, ఇంటింటి సందర్శన, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, మండల, గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం గురించి తెలుసు కొని సంతోషం వ్యక్తం వ్యక్తం చేశారు. మొరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి అందుతున్న వైద్య సేవలు పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్. శ్రీధర్ , జిల్లా సంక్రమిత వ్యాధుల నివారణ అధికారి (ఎన్ సి డి) డాక్టర్. దినేష్ , జిల్లా ఎన్ హెచ్ ఎం ప్రోగ్రామ్ అధికారి సలిత , జిల్లా అదనపు మలేరియా నివారణ అధికారి గొంది వెంకటేశ్వర్లు , డిపిఎమ్ఓ శ్రీనివాసరావు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నగేష్, హెచ్ ఈ ఓ రాంప్రసాద్ వైద్యాధికారులు సూపర్ వైజర్స్, ఎం ఎల్ హెచ్ పి లు సిస్టర్స్, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు మాజీ జడ్పిటిసి శ్రీలత గౌరవ సత్కారం

దశ బూర్గంపాడు: భద్రాచలం టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్ కి యూనియన్ అధ్యక్షుల ఆహ్వానం మేరకు మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రామ కొండారెడ్డి దంపతులు, బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు జలగం జగదీష్ , లక్ష్మీపురం ఉపసర్పంచ్ యారం పున్నారెడ్డి లు హాజరైనారు, ఈ సందర్భంగా కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా సమాజంపై చూపుతున్న ప్రభావం, సమాచార ప్రసారంలో వేగం, తప్పుడు ప్రచారం, ఫేక్ న్యూస్, బాధ్యతాయుత జర్నలిజం, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రతి వ్యక్తి జీవితంలో భాగంగా మారిన నేపథ్యంలో, దాని సానుకూల, ప్రతికూల ప్రభావాలు, ప్రజల్లో మీడియా విజ్ఞానం పెంపు, ఫేక్ న్యూస్‌ను గుర్తించే విధానాలు, బాధ్యతాయుత సమాచార వినియోగం, జర్నలిస్టుల పాత్ర, డిజిటల్ మీడియా భవిష్యత్తు వంటి సమకాలీన అంశాలపై వెల్లడించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రత్యేక బాధ్యతలు స్వీకరించిన బూర్గంపాడు మండల జర్నలిస్టులను మాజీ జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత రామాకొండ రెడ్డి దంపతులు జర్నలిస్టులకు శాలువాను కప్పి సీతారాముల వారి మెమొంటోని రాముల వారి లడ్డు ప్రసాదాన్ని అందజేస్తూ గౌరవ సత్కారం చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టు, మండల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

చింతిర్యాల కాలనీ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ

దశ, అశ్వాపురం : చింతిర్యాల కాలనీ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని అశ్వాపురం ఎంపీడీవోతో పాటు బూర్గంపాడు సబ్‌డివిజన్ పంచాయతీరాజ్ డీఈ బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు, త్వరలోనే ప్రారంభోత్సవం నిర్వహించి గ్రామపంచాయతీ పాలకవర్గానికి భవనాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రధాన బీటీ రహదారి దెబ్బతిన్న పరిస్థితిని పరిశీలించారు. రూ.2.42 కోట్లతో రహదారి అభివృద్ధికి పరిపాలనా అనుమతులు లభించినప్పటికీ టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో, తాత్కాలికంగా గ్రామపంచాయతీ నిధులతో గుంతలను జీఎస్‌బీ మెటీరియల్‌తో పూడ్చాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సంద్రలబోడు, చింతిర్యాల గ్రామాల సర్పంచులతో చర్చించిన అధికారులు, మూడు గ్రామపంచాయతీల తీర్మానాల ఆధారంగా సంయుక్తంగా పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేస్తామని వెల్లడించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లే గ్రావెల్ రహదారి ఏర్పాటు, నూతన పంచాయతీ భవనం చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్, ఉపసర్పంచ్‌కు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనసా అలివేలు, ఉప సర్పంచ్ వెన్న అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు..

దశ బూర్గంపాడు: ఆరోగ్య ప్రదాత, పేదల పెన్నిధి అపర భగీరధుడు ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గుమ్మానికి చేరవేసిన గొప్ప మహానీయుడు వైయస్సార్ అని ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషకరమని వైయస్సార్ అభిమానులు పేర్కొన్నారు. బూర్గంపహాడ్ మండలంలో మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో బుధవారం వైయస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహోన్నత పథకాలతో తెలుగు రాష్ట్రాల ప్రజల మన్ననలు పొందిన మరుపురాని మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్" వై.యస్.రాజశేఖర్ రెడ్డి గారి 77 వ జయంతి వేడుకలను బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ఆయా మండలపార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మరియు వై.యస్.ఆర్ అభిమానుల నేతృత్వంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచుతూ జననేతకు ఆత్మీయ నివాళులు అర్పించిన బూర్గంపహాడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వై. యస్. ఆర్ అభిమానులు పాల్గొన్నారు.